క్లుప్తంగా

ప్రజలకు అండగా ఉంటాం



అలంపూర్: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. అలంపూర్ మండల క్యాతూర్ గ్రామానికి చెందిన నరేంద్ర అనారోగ్య సమస్యలతో ఆపరేషన్ చేయించుకోవడానికి సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి నుంచి వైద్యం కోసం రూ.6 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు తెలిపారు. ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. వీరితో పాటు నాయకులు నాగేశ్వర్ రెడ్డి, కోదండరామిరెడ్డి, దేవా, తదితరులు ఉన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థన



ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఆగస్టు నెల మొదటి ఆదివారం కావడంతో బల్లారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ఎంబీ షాలేం మందిరంతో పాటు హోసన్నా, మరనాథ విశ్వాస సమాజ మందిరం, కల్వరి చర్చిల్లో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల పాస్టర్లు బైబిల్ ప్రవచనాలు వివరించారు. ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలని ఎంబీ చర్చి పాస్టర్ సీపీ యాధా సూచించారు. కేరళ వరద బాధితుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సహపక్తి భోజనాలు చేశారు.

ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజనలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు సప్తాహ భజనలో పాల్గొన్నారు. వారంరోజుల పాటు నిరంతరంగా కొనసాగే సప్తాహ భజనలు చేసే సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెట్టెంపాడు నీటితో చెరువులు నింపాలి



అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్ట్ నీటితో చెరువులను నింపాలని అఖిలపక్షం కమిటీ నాయకులు ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అఖిలపక్ష కమిటీ కార్యాలయంలో అఖిలపక్ష కమిటీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ఎగువ ప్రాంతం నుంచి నదులకు పుష్కలంగా నీరువస్తున్నా, చెరువుల్లో చుక్కనీరు లేదని వాపోయారు. గతంలో వాగుల నుంచి వచ్చే వరద నీటికి చెరువులు నిండి కుండల్లా కనిపించేవని, పైభాగాన చేపట్టిన రిజర్వాయర్ల వల్ల వాగుల్లోకి వర్షనీరు రావడంలేదన్నారు. దానివల్ల చెరువు ఆయకట్టు పంటపొలాలు బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ల నుంచి కాల్వలకు ఏర్పాటు చేసి చెరువులను నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘనంగా చౌడేశ్వరి జయంతి

వీపనగండ్ల: మండలంలోని తూముకుంటలో చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం వీర తొగట క్షత్రీయ వంశస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాములు, నారాయణ, ఈశ్వరయ్య, శివరాములు, శి వుడు, సత్యనారాయణ, రవి, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



మాచర్లలో ఆలయం దగ్గర భక్తులకు అన్నదానం

ఆలయాల్లో పోటెత్తిన భక్తులు

- అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు
- తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, అర్చనలు
- దాతల సహకారంతో భక్తులకు అన్నదానం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకం చేశారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తమ కొత్త, పాత వాహనాలకు అర్చకులతో పూజలు చేయించారు. గద్వాల కాకతీయ టెక్నో స్కూల్ యాజమాన్యం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు నాగరాజుశర్మ, చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని ప్రధాన ఆలయాల్లో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి, కోతులగిద్ద అరణేశ్వర స్వామి, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గట్టు: అమావాస్య సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండల కేంద్రంలో గండి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మాచర్ల గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. మాచర్లకు చెందిన బంగారు దుకాణం యజమానులు ఆలయం దగ్గర భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పల్లకీ సేవతో సీతారాముల విగ్రహాలను ఆలయం చుట్టు ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్యదానం ఏర్పాటు చేశారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం, మారుతినగర్ ఆంజనేయస్వామి ఆలయం, వడ్డేపల్లి గట్టుపై వెలసిన శ్రీవసంతమాధవ స్వామి ఆలయం, జమ్ములమడుగులోని దత్తాత్రేయస్వామి, జూలెకల్ ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో వెలసిన శివాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అమావాస్య సందర్భంగా మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో భక్తి పారవశ్యం నెలకొంది.

గో సేవలో తరించిన భక్తులు

శాంతినగర్: శాంతినగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు గోమాత సేవలో తరించారు. గోవుకు పశుగ్రాసంతోపాటు పాలకూర, తోటకూర, ఆకుకూరలు ఆహారంగా అందజేశారు. గో ప్రచారక సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీవారి భక్తులు, ఆర్యవైశ్య మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు ఆవుకు పూజలు చేశారు. పట్టు వస్త్రాలతో గోవును అలంకరించి పూజలు చేసి తరించారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలోని వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. మానవపాడు, చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, అమరవాయి, నారాయణపురం, కలుకుంట్ల తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి ఆకుపూజ, ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్ర మం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సురేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలోని అంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆకు పూజ, అర్చన చేశారు. ఆయా గ్రామాల్లో ఉదయం నుండే భక్తులు ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు.



డి.బూడిదపాడు ఆలయం చుట్టు పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



వెంకటాపురంలో వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



మానవపాడులో అన్నదానం ఏర్పాటు చేసిన దాతలు

జిల్లా అగ్నిమాపక అధికారి బదిలీ



జిల్లా అగ్నిమాపక అధికారిని సన్మానిస్తున్న ఫైర్ సిబ్బంది

గద్వాల క్రైం: జిల్లా అగ్నిమాపక అధికారి అజ్మీర్ శ్రీదాస్ బదిలీ అయ్యారు. ఆదివారం సిబ్బంది వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక విభాగంలో 2019లో బాధ్యతలు చేపట్టి పలు విపత్కర సమయాల్లో ధైర్యంగా విధులు నిర్వహించారు. అగ్ని ప్రమాదాల వల్ల జరిగే నష్టాలు, విపత్తుల సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ప్రజలకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించారని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాలు జిల్లా అధికారిగా సేవలు అందించారు. వారి స్థానంలో యాదాద్రి జిల్లాకు చెందిన అశోక్‌రెడ్డి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అగ్నిమాపక అధికారులు, సిబ్బంది కిషోర్, ధర్మ, రాకేష్, గౌస్‌పాష, నాగరాజు, నరేష్‌గౌడు, మన్ననూర్ రవి కుమార్ నాయక్ ఉన్నారు.

నత్తనడక ఆర్డీఎస్ కాల్వ పనులు

- ఇబ్బందులు పడుతున్న రైతులు



చంద్రశేఖర్‌నగర్ వద్ద ఆర్డీఎస్ కాల్వకు మరమ్మతులు పనులు

మానవపాడు: ఆర్డీఎస్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కాల్వల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎప్పుడో పూర్తి కావల్సిన పనులు ఆలస్యం కావడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి తుంగభద్ర నది నుంచి దిగువకు వదులుతున్నారు. తుంగభద్రలో నీరు వృథాగా కిందకు పారుతున్నాయి. మానవపాడు, వడ్డేపల్లి, రాజోళి, ఉండవెల్లి, అలంపూర్ ప్రాంతాలలోని రైతులకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందక రైతులు బ్బందులు పడుతున్నారు. ఎద్దులబండ్లపై డ్రమ్‌లతో నీరుతీసుకొచ్చి పంటపొలాలకు నీరు పారిస్తున్నారు. డ్రమ్‌లు, బిందెలతో రైతులు నీటిని నివాసగృహాల నుంచి తీసుకెళ్తున్నారు. ఆర్డీఎస్ డీ–30, డీ–31 కాల్వల మరమ్మతులు పూర్తికాక తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా నీరు అందడంలేదు. పంటపొలాల్లో మందుల పిచికారీకి నీరులేక అవస్థలు పడుతున్నారు. తుమ్మిళ్ల ద్వారా నీటిని అందించాలని ఆయా మండలాల రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తుమ్మిళ్ల కాల్వలకు నీరు విడుదల చేయించాలని రైతులు కోరుతున్నారు.



గోకులపాడులో ఎద్దుల బండిపై డ్రమ్‌లతో పొలానికి నీరు తీసుకెళ్తున్న రైతు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ డ్రామాలతో రైతులకు నష్టం



తుమ్మిళ్ల లిఫ్టు వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రాజోళి: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల డ్రామాల కారణంగా ఆర్డీఎస్ రైతులు మరోసారి మోసపోతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని, సుంకేసుల బ్యారేజీని ఆదివారం పరిశీలించారు. అనంతరం తుమ్మిళ్ల లిఫ్టు దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. తాము గెలిస్తే తుమ్మిళ్ల లిఫ్ట్‌లో భాగమైన మల్లమ్మ కుంట, వల్లూరు, జూలకల్ రిజర్వాయర్లు నిర్మిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఎగువ ప్రాజెక్టుల నుంచి లక్షల క్యూసెక్కులు నీరు, జిల్లా మీదుగా ఇతర రాష్ట్రానికి తరలిపోతుందన్నారు. పాలకులు సొంత జిల్లాలో రైతులకు సాగు నీరందించలేకపోతున్నారన్నారు. ప్రాజెక్టుల పేరుతో ఓట్లు దండుకున్నారు తప్ప, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు అలంపూర్ నియోజకవర్గంలో రైతులకు చేసిందేమీ లేదన్నారు. ఆర్డీఎస్ రైతులకు సాగు నీరు పూర్తి స్థాయిలో అందకపోతే పెద్ద ఎత్తున నిరసన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజగోపాల్, బీంసేన్‌రావ్, కేకే రెడ్డి, శశికుమార్, మురళీ కృష్ణ, ఈసీ ఆంజనేయులు, కొంకతి రాము, గోవిందు, రాజు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఉండవెల్లిలో కేక్‌కట్ చేస్తున్న యువకులు

ధరూరు: పేద, ధనిక తారతమ్యాన్ని చూడని స్నేహితుల దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం, ఆయా గ్రామాల్లో స్నేహితుల దినోత్సవం చేశారు. ధరూరులో చిన్నారులు ఒకరికొకరు స్నేహానికి చిహ్నంగా ఫ్రెండ్‌షిప్ బ్యాడ్జీలు కట్టుకున్నారు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబరం చేసుకున్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో యువకులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్‌లు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. 2008–09 పదో తరగతి విద్యార్థులు కలుసుకొని వారి వృత్తి, నైపుణ్యాలపై వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1982 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా అందరు కలుసుకోవడం ఇది 6వ సారి అని పేర్కొన్నారు. మిత్ర బృందంలో తోటి మిత్రుడు ఉపాధ్యాయుడు నాగరాజు పదవీ విరమణ కావడంతో అయనను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నటరాజ్, ఆబేద్‌ఖాన్, కామేశ్వర రెడ్డి, గణేష్, మోహన్‌కుమార్, నవాజ్, నాగరాజు, బలరాం, అబ్దుల్ ఖదీర్, బాబు, దేవేందర్ పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో, గ్రామాల్లో స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్‌చేసి, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. చిన్ననాటి స్నేహితులు కలుసుకొని బాల్యం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



ధరూరులో స్నేహానికి చిహ్నంగా ఫ్రెండ్‌షిప్ బ్యాడ్జీలు కట్టుకుంటున్న చిన్నారులు



అలంపూర్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అటెన్షన్ ప్లీజ్

నీళ్లతో డంపింగ్ యార్డు



చిన్నఆముదాలపాడులో నిండుకుండలా మారిన డంపింగ్ యార్డు

ఉండవెల్లి: మండలంలోని చిన్న అముదాలపాడులో డంపింగ్ యార్డ్‌లో చెత్తను వేసేందుకు నిర్మించారు. కొద్ది రోజులుగా ఆ డంపింగ్ యార్డులో నీరు నిలిచింది. కార్యదర్శి మారుతున్నారని, ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో చెత్తను పారిశుద్ధ్య కార్మికులు డంపింగ్ యార్డు బయటే వేస్తున్నారు. డంపింగ్ యార్డులో నీటిని తొలగించి, చెత్తను వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంప్రదించవలసిన అధికారి: తిరుపతన్న, ఎంపీఓ, ఉండవెల్లి, సెల్: 7989748301

పొంచి ఉన్న ప్రమాదం

- ఇంటిమిద్దెలపై విద్యుత్ తీగలు
- గ్రామాల్లో రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఒరిగిన విద్యుత్ స్తంభం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



మానవపాడు ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మానవపాడు: అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలోని గ్రామాల్లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు దర్శనమిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు సంభవిస్తున్నా విద్యుత్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం విద్యుత్‌పట్ల నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. కొన్ని గ్రామాల్లో నేటికీ ఇనుప స్తంభాలే కనిసిస్తున్నాయి. వర్షం వచ్చినప్పుడు ఇనుపస్తంభాలను పట్టుకుంటే షాక్ కొడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నిపాడు పాఠశాలకు వెళ్లే దారిలో, నివాసగృహాల మధ్య, మానవపాడులో గాంధీచౌక్ చౌరస్తా వద్ద ట్రాన్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

చెన్నిపాడులో నివాసగృహాలపై విద్యుత్ తీగలు

చెన్నిపాడులోని కొత్త ఎస్సీకాలనీలో నివాసగృహాలపై విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి.అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఈ విషయం చెప్పినా పట్టించుకోవడం లేదు. గతేడాది ఇదురుగాలులు, వర్షాలకు విద్యుత్‌స్తంభం, గుడిసేపై కులింది. ప్రమాదవశాత్తు గుడిసెలో ఎవరూ లేకపోవడంతో ఆర్థికంగా నష్టం జరిగి, ప్రాణాలు మిగిలాయి. జిల్లా పరిషత్, ప్రైమరీ పాఠశాలకు వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేదు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే అబ్రహంలు సర్వసభ్య సమావేశంలో తొలగించాలని తీర్మానించి విద్యుత్ అధికారులకు సూచించినా చర్యలు తీసుకోలేదు.



చెన్నిపాడులో ఇంటిమిద్దెపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

గృహాలపై విద్యుత్ తీగలు తొలగించాలి



చెన్నిపాడులో నివాసగృహాలపై తీగలు తొలగించాలని చాలా సార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపి నివాస గృహాలపై విద్యుత్ తీగలు తొలగించాలి.

– శేఖర్, చెన్నిపాడు

కంచెలు లేక భయంగా ఉంది



మండల కేంద్రంలోని ప్రధా న రహదారి గుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ కంచె లే క ప్రమాదకరంగా ఉంది. ప్ర తినిత్యం ప్రజలు, వాహనదారులు తిరుగుతారు. కొన్ని సందర్భాల్లో పశువులు తిరుగుతాయి. విద్యుత్ అధికారులు చర్యలు కంచె ఏర్పాటు చేయాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, మానవపాడు

రక్షణ లేనివాటిని గుర్తిస్తాం..

మండలంలో ప్రమాదకరంగా ఉ న్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తిస్తాం. పాఠశాల దారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వేరే చోటుకు మార్చేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే కంచెలు ఏర్పాటు చేస్తాం. చెన్నిపాడులో సమస్యను పరిష్కారం చేస్తాం.

– సత్తార్‌బాషా, విద్యుత్ ఏఈ, మానవపాడు

రోడ్డును నిర్మించండి



చంద్రశేఖర్ నుంచి చెన్నిపాడు వెళ్లే రహదారి

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్ నుంచి చెన్నిపాడు, గోకులపాడు గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలమయంగా తయారైంది. చాలా ఏళ్లుగా గుంతలతో రోడ్డు ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. రాత్రి సమయంలో రైతులకోసం పంటపొలాల్లో నీరు పంటకు అందిచడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.